RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 2 డిసెంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 203 | పేజీలు: 4 | వెల: రూ.5/-



జనాభా వృద్ధిరేటుపై ఆందోళన వ్యక్తం చేసిన

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): భారత దేశ జనాభా వృద్ధి రేటు తగ్గుతుండడంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంతానోత్పత్తి రేటు 2.1 శాతానికి మించి ఉండాలని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశమని.. సమాజంలో సంతానోత్పత్తి రేటు 2.1 శాతం కంటే తక్కువగా ఉంటే.. ఆ సమాజం ఎలాంటి సంక్షోభం అవసరం లేకుండానే భూమిపై మనుగడ అంతరించిపోయే అంచునకు చేరుకుంటుందని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గడం వల్ల అనేక భాషలు, సమాజాలు ఇప్పటికే ఉనికి కోల్పోయాయన్నారు. 1998, 2002లో భారత జనాభా విధానం రూపొందిందని, 2.1 శాతానికి కంటే సంతోనోత్పత్తి పడిపోకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. సమాజం మనుగడకు ఇద్దరు, ముగ్గురి అవసరం ఉందన్న ఆయన.. ఆధునిక జనాభా శాస్త్రం చెబుతున్నది కూడా ఇదే చెబుతుందన్నారు. ఈ సంఖ్య చాలా కీలకమని లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. జనాభా వృద్ధి రేటు తగ్గుముఖం పట్టడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఇదిలా ఉండగా.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వస్తున్నది. 1950 సంవత్సరంలో ఫెర్టిలిటీ రేటు 6.2శాతం కంటే ఎక్కువ ఉండగా.. ప్రస్తుతం అది 2.1శాతానికి తగ్గింది. ఇలా కొనసాగితే 2050 నాటికి సంతానోత్పత్తి రేటు 1.3కి పడిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ఈ నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో రైతు భరోసా విధివిధానాలు, కులగణన వివరాలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉన్నది. అయితే ఈ సమావేశాల్లో.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అటకెక్కించడంపై ఆసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది. రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో చర్చిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారు. కులగణన వివరాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చ జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలన తనకు సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అంతేగాక సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేస్తామని ప్రకటించారు.



కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై

## 6 అబద్ధాలు.. 66 మోసాలు

### బీజేపీ ఛార్జ్‌షీట్

'రేవంత్ భాష మార్చుకుంటే మేం చర్చకు సిద్ధం'

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై చర్చకు తాను సిద్ధమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై 6 అబద్ధాలు.. 66 మోసాలు.. పేరిట కిషన్‌రెడ్డి ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాష మార్చుకుంటేనే రేవంత్‌రెడ్డితో చర్చకు వస్తాం.కేసీఆర్ లాగా అదే భాష కాకుండా.. నిర్మాణాత్మక అంశాలపై మేము చర్చకు సిద్ధం. కుల గణనను మేము వ్యతిరేకించడం లేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం.. గ్రూప్ 1, 2, 3, 4 నియామకాలు ఎప్పుడో పూర్తవ్వాలి. ఇప్పటి వరకు

..మిగతా 2లో

'రైతు భరోసా'పై

# సీఎం గుడ్‌న్యూస్

### సంక్రాంతి తర్వాత అన్నదాతల ఖాతాల్లోకి సొమ్ము

### రైతు భరోసా సొమ్ముపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపికుబురు అందించింది. సంక్రాంతి తర్వాత రైతుభరోసా నిధులు జమచేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రూ. 16 వేల కోట్ల మిగులుతో తెలంగాణను కేసీఆర్‌కు అందిస్తే, పదేళ్ల తర్వాత రూ.7 లక్షల అప్పులతో రాష్ట్రాన్ని తమకు అప్పగించారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇన్నేళ్ల కాలంలో ఏ ప్రభుత్వం ఇంత తక్కువ కాలంలో రుణమాఫీ చేయలేదన్న సీఎం 2018 నుంచి 2023 వరకు ఐదేళ్లలో తీసుకున్న రుణాలన్నీ ఏకకాలంలో తీర్చినట్లు వివరించారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా రైతు ఖాతాల్లో జమచేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి సంబంధించిన విధి విధానాలపై చర్చించి, సంక్రాంతి పండగకి రైతు భరోసా అమలు చేస్తామని గ్యారంటీ ఇస్తున్నాను అని వెల్లడించారు. తెలంగాణకు భారీగా అప్పులు ఉన్నప్పటికీ రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. లక్షలాది

..మిగతా 2లో



## ప్రభుత్వ ఏర్పాటుపై బీజేపీదే తుది నిర్ణయం

### తేల్చేసిన ఏక్‌నాథ్ షిండే

మహారాష్ట్ర, (ప్రభాత సూర్యుడు): మహారాష్ట్ర సీఎం పదవిపై రాష్ట్ర ఆపద్ధర్మ సీఎం ఏక్ నాథ్ షిండే పెదవి విప్పారు. అధికార మహాయుతి కూటమిలోని మూడు మిత్ర పక్షాల మధ్య సమన్వయ లోపం లేదని కొట్టి పారేశారు. ప్రభుత్వంలో అధికార పంపిణీపై తన పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని

..మిగతా 2లో

ములుగు జిల్లాలో

# భారీ ఎన్‌కౌంటర్



### ఏడుగురు మావోయిస్టులు మృతి

### గ్రేహౌండ్స్, మావోయిస్టుల మధ్య భీకర పోరు

### మృతుల్లో మావోయిస్టు కీలక నేత


ఏటూరునాగారం (ప్రభాత సూర్యుడు): ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం చెల్పాక గ్రామ సమీపంలో భారీ ఎన్కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు.మృతి చెందిన వారిని ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ దళంగా పోలీసులు గుర్తించారు. కాగా ఎన్కౌంటర్లో మృతి చెందిన వారిలో ఇల్లందు - నర్సంపేట ఏరియా పార్టీ కార్యదర్శి తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ కుర్సం మంగు అలియాస్ భద్రు(35) అలియాస్ పాపన్న,

..మిగతా 2లో

## సినీ ఇండస్ట్రీలో విషాదం.. బుల్లితెర నటి ఆత్మహత్య

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సినీ ఇండస్ట్రీలో విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో కన్నడ బుల్లితెర నటి ఆత్మహత్య చేసుకుంది. పలు కన్నడ సీరియల్స్‌లో నటించిన ఆమె సూసైడ్‌కు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం కోసం శోభిత మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. (ఇది చదవండి: నాలుగు పెళ్లిళ్లు కాదు.. నాది రెండోపెళ్లి మాత్రమే.. నటుడు యూటర్న్). కన్నడ సీరియల్స్‌లో నటిస్తోన్న శోభిత తన భర్తతో కలిసి గచ్చిబౌలిలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. అయితే శోభిత మృతిపై

..మిగతా 2లో





ఛత్తీస్‌గఢ్‌లో ఘోర

## రోడ్డు ప్రమాదం

### కారును ఢీకొట్టిన ట్రక్కు

### ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం

రాయ్‌పూర్ (ప్రభాత సూర్యుడు): ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. రాయ్‌పూర్ నుంచి అంబికాపూర్ వెళ్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో నలుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సుర్గుజా జిల్లా అంబికాపూర్ - బిలాస్‌పూర్ జాతీయ రహదారి 130పై ఉదయపూర్ సమీపంలో ప్రమాదం చోటు చేసుకున్నది. ప్రమాతం తర్వాత ట్రక్కు డ్రైవర్ తప్పించుకునేందుకు కార్‌ని రివర్స్ చేయగా.. కారు మరింత

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ప్రభుత్వ ఏర్పాటుపై
# బీజేపీదే తుది నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి...**

ఆదివారం తెలిపారు. ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ తర్వాత ఆరోగ్య కారణాల పేరుతో ఏక్ నాథ్ షిండే తన సొంతూరికి వెళ్లారు. ఆదివారం ఠాణేకు బయలుదేరడానికి ముందు మీడియాతో మాట్లాడుతూ ఏక్ నాథ్ షిండే తన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. గత రెండున్నరేండ్లుగా సీఎం గానూ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విశ్రాంతి లేకుండా పని చేయడం వల్ల ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకున్నానని ఏక్ నాథ్ షిండే చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో తన వైపు నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేవని బీజేపీ అగ్ర నాయకత్వానికి హామీ ఇచ్చానని ఏక్ నాథ్ షిండే తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో శివసేన నుంచి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో హోంమంత్రి ఎవరికి ఇస్తారన్న విషయమై తదుపరి భేటీలో ఖరారవుతుందన్నారు. మరోమారు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. తమకు మెజారిటీ కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటామని, ప్రతిపక్షానికి కాదన్నారు.

## ‘రైతు భరోసా’పై
# సీఎం గుడ్‌న్యూస్

**మొదటి పేజీ తరువాయి...**

మంది రైతులు శనివారం మహబూబ్‌నగర్ రైతు పండుగలో పాల్గొన్నారన్న ఆయన, మిగతా 9 ఏళ్లు కూడా అన్ని కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తామనే నమ్మకం కలిగిందన్నారు. డిసెంబర్‌లో జరిగే శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి విధివిధానాలు ఖరారు చేసి సంక్రాంతి తర్వాత రైతు భరోసా చెల్లిస్తామన్నారు. ఈ విషయంలో మారీచుల మాటలను విశ్వసించరాదని రైతాంగానికి సూచించారు. ప్రజా ప్రభుత్వం –ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పాలమూరు జిల్లాలో జరిగిన రైతు పండుగ విజయవంతమైన నేపథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దామోదర రాజనర్సింహా జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు పండుగలో ప్రత్యక్షంగా పాల్గొన్న రైతాంగం, రాష్ట్ర వ్యాప్తంగా 568 రైతు వేదికల ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్న లక్షలాది రైతులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా చెల్లించేది గ్యారెంటీ. ఈ విషయంలో ఎవరినీ నమ్మకండి. రైతు భరోసా విధి విధానాలను ఖరారు చేయడానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మంత్రులు తుమ్మల పొంగులేటి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించాం. ఈ నెలలో జరిగే శాసనసభ సమావేశాల్లో విధి విధానాలపై చర్చించి సంక్రాంతి తర్వాత రైతు భరోసా చెల్లిస్తామని హామీ ఇస్తున్నాం. రైతు భరోసా పథకం కొనసాగుతుంది. ప్రభుత్వ పరంగా వాస్తవాల ప్రాతిపదికన కొన్ని అంశాలు చర్చించుకుని ముందుకు వెళ్లడం ద్వారా రైతాంగానికి, మహిళలకు, విద్యార్థినీ విద్యార్థులకు ఒక మంచి పాలన అందించడం సాధ్యమవుతుంది. రాష్ట్రం ఏర్పడే నాటికి 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో 69 వేల కోట్ల అప్పులు ఉండేవి. సరిగ్గా పదేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత తెలంగాణకు



ఏడు లక్షల కోట్ల అప్పు ఉంది. ఆ అప్పుపై అసలు, మిత్తి కలిపి ప్రతి నెలా 6,500 కోట్ల రూపాయలు చెల్లించే పరిస్థితి ఉంది. తెలంగాణ ప్రభుత్వంపై ఇంత అప్పు ఉందన్న సంగతి ఆ పదేండ్లలో ఏ సందర్భంలో కూడా ఆర్థిక నిపుణులుగానీ, రాజకీయ విశ్లేషకులు గానీ ఆర్థిక మంత్రిగానీ ప్రజలకు వాస్తవాలు వెల్లడించలేదు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి తర్వాత వాస్తవ పరిస్థితులు ప్రజలకు వివరించాలన్న ఉద్దేశంతో ఆస్తులు, అప్పులు, విద్యుత్, సాగునీటి రంగాలపై శ్వేతపత్రం విడుదల చేశాం. ఆ లెక్కల ప్రకారం 7 లక్షల కోట్ల అప్పులు తేలాయి. దీన్ని బట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా క్షీణించిందో ప్రజలు అర్థం చేసుకోవాలి. గత ప్రభుత్వం చెల్లించాల్సిన రైతు బంధు చెల్లించకుండా బకాయి పెడితే, అధికారం చేపట్టిన వెంటనే 7,625 కోట్ల రూపాయలు తమ ప్రభుత్వం చెల్లించింది. నాలుగు విడతల్లో కలిపి మొత్తంగా 25,35,964 మంది రైతు కుటుంబాలకు 20,616.89 కోట్ల రూపాయల మేరకు రుణ మాఫీ చేశాం. ఒకటవ విడత %-% 18-07-2024 నాటికి లక్ష రూపాయల లోపు ఉన్న 11,34,412 మంది రైతులకు 6034.96 కోట్ల రూపాయలతో రుణమాఫీ చేశాం. రెండవ విడత - 30-07-24 నాటికి లక్షన్నర వరకు 6,40,823 మంది రైతులకు 6,190.01 కోట్ల రూపాయల మేరకు రుణ మాఫీ జరిగింది. మూడవ విడత %-% 15-08-2024 నాడు రెండు లక్షల వరకు 4,46,832 మంది రైతులకు 5,644.25 కోట్ల రూపాయల మేరకు రుణ మాఫీ అయింది. నాలుగవ విడత సాంకేతిక లోపాలు, రేషన్ కార్డు లేదా బ్యాంకుల్లో లోపాల వంటి కారణాలతో నిలిచిపోయిన 3,13,897 మంది రైతు కుటుంబాలకు 2747.67 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో వేయడం జరిగింది. దేశ స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఈనాటి వరకు ఏ రాష్ట్రంలో కూడా ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ ఏ ప్రభుత్వం కూడా చేయలేదు. ఈ దేశంలోనే ఇదొక రికార్డు. 2018 ఎన్నికల తర్వాత గత ప్రభుత్వం రుణ మాఫీ 4 ఏండ్ల పాటు సాగదీస్తూ విడత వారిగా చెల్లించడంతో వడ్డీలకే పోయిందని, 2018-23 మధ్య ఐదేండ్ల కాలంలో 3,031 కోట్ల మాత్రమే అసలు రుణ మాఫీ చేసింది. గత ప్రభుత్వం 2023 వానాకాలం చెల్లించకుండా వదిలేసిన రైతు బంధు బకాయిలు 7,625 కోట్ల రూపాయల కూడా ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే చెల్లించింది. గతంలోవరి వేస్తే ఉరి వేసుకోవలసిందే, ధాన్యం కొనుగోలు కేంద్రాలే ఉండవని చెప్పిన పరిస్థితుల నుంచి వరి వేసుకోండి. కొంటామని చెప్పి భరోసా ఇవ్వడంతో పాటు సన్నాలు వేసుకుంటే బోనస్ ఇస్తామని ప్రోత్సహించాం. వర్షాకాలంలో సన్నాలకు బోనస్ ఇచ్చాం. బోనస్ ఒక్కసారి ఇచ్చి వదిలేయడం కాదు. వచ్చే సీజన్‌లో కూడా బోనస్ ఇస్తాం. తెలంగాణలో వాడకం ఎక్కువగా ఉన్న, అలాగే దిగుబడి అధికంగా ఉండే తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్‌ఎంటీ వేయాలి. తెలంగాణ ప్రజలు అత్యధికంగా ఈ బియ్యం ఎక్కువగా తింటారు. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వంటి ప్రభుత్వ వసతి గృహాల్లో సన్న బియ్యంతో అన్నం పెట్టనున్నాం. ఆ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని రైతాంగం అధిక వినియోగం ఉన్న సన్న రకాలను వేయాలి. ఈ ప్రభుత్వం రైతుల కోసమే ఉన్నది. వ్యవసాయం దండగ కాదు. పండుగ అన్న భరోసా రైతుల్లో కల్పించాలని ముఖ్యమంత్రి అన్నారు.

## కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై
# 6 అబద్ధాలు.. 66 మోసాలు

**మొదటి పేజీ తరువాయి...**

ఫస్ట్ ఫేస్ కూడా పూర్తికాలేదు. షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు ఏదీ పూర్తవ్వలేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. భూసేకరణ చేపట్టవద్దని కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేశారు. కాంగ్రెస్ కూడా భూసేకరణ చేపట్టే సమయంలో పద్ధతి ప్రకారం చేయాలి.. రైతులతో మాట్లాడి పరిష్కారం చేసుకోకుండా రైతులపై దాడులా..ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం నడుచుకోవాలి. ఫామ్ హౌజ్‌లో ఉన్న కేసీఆర్‌తో కాంగ్రెస్ సంబంధాలు పెట్టుకుంది. కేసీఆర్ పుట్టిందే కాంగ్రెస్‌లో..కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు. రేవంత్ దృష్టిలో ఆయన్ను ప్రశ్నించే వారు.. వార్తలు రాసేవారు కూడా మానవ మృగాలే. కాంగ్రెస్ మేనిఫెస్టో అమలుకు ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకోవాలో కూడా రోడ్డు మ్యాప్ లేదు’అని మండిపడ్డారు.

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ గ్యారంటీల గారడీ పేరుతో “6 అబద్ధాలు - 66 మోసాలు” పేరిట బీజేపీ ఛార్జ్‌షీట్‌ను విడుదల చేశారు.

“కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఆకర్షించేందుకు అమలు చేయడానికి వీలులేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కానీ ఈ ఏడాది కాలంలోనూ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. వందరోజుల్లో నెరవేరుస్తామని చెప్పిన హామీలు ఏడాది గడిచినా నెరవేరలేదు. ప్రజా సమస్యలు ఎక్కడికక్కడ ఉండగానే ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం దారుణం. ప్రజలు ఇవి చూసి దిగ్భ్రాంతికి గురవుతున్నారు” అని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బీజేపీ విడుదల చేసిన ఛార్జ్‌షీట్

“గతేడాది డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామంటూ హామీ ఇచ్చారు. కానీ ఏడాది గడిచినా రైతులకు రుణమాఫీ పూర్తి కాలేదు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని ప్రకటించినా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఇది రైతుల ఆకాంక్షలను దెబ్బతీస్తోంది,” అని ఆయన విమర్శించారు.

“బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు నియంతృత్వ, కుటుంబ, అవినీతి పాలన సాగించింది. అఖిల భారత ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. గతంలో ప్రజలు నిరంకుశ పాలనను గద్దె దించినా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల్లో ఏమాత్రం తేడా లేదు,” అంటూ కిషన్ రెడ్డి తన ఆరోపణలను వెల్లగక్కారు.

కిషన్ రెడ్డి వ్యాఖ్యల ప్రకారం, ప్రభుత్వ హామీల అమలు లేకుండా జరుగుతున్న పనితీరును ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ప్రజా సంక్షేమానికి నిజంగా కట్టుబడి ఉన్న పాలన కోసం భారతీయ జనతా పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర
# రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

దెబ్బతింది. మృతులను చంగురభతా రాయ్‌పూర్ వాసులుగా గుర్తించారు. జగదల్‌పూర్‌కు కారులో బయలుదేరగా.. ఉదయపూర్ అదానీ గెస్ట్ హౌస్ సమీపంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను కట్టర్ల సహాయంతో తొలగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ములుగు జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

**మొదటి పేజీ తరువాయి...**

ఏటూరునాగారం మహదేవ్ పూర్ ఏరియా కమాండర్ ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు(43)తో పాటు దళ నాయకులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), దళ సభ్యురాలు ముస్సాకి జమున(23), జైసింగ్ (24), కిషోర్ (22), కామేష్(23) ఉన్నారు. ఆదివారం తెల్లవారు జామున పోలీస్ కూంబింగ్ దళాలకు చెల్పాక వద్ద మావోయిస్టులు ఎదురు పడటంతో ఎదురు కాల్పులు మొదలయ్యాయి, కాల్పుల అనంతరం పోలీసులు ఘటనా స్థలంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మూడు ఏకే-47,రైఫిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దళ కమాండర్ బద్రుతో పాటు మరో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. బద్రుపై ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల రివార్డు ఉంది. అంతేకాకుండా గుత్తికోయ సామాజిక వర్గానికి చెందిన బద్రు స్వస్థలం ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా చెరమంగి,ఏగోళపు మల్లయ్య అలియాస్ మధుది పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామం. ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ స్వస్థలం బీజాపూర్ జిల్లా ఉసూర్ గ్రామం. అలాగే మిగతా నలుగురు మావోయిస్టు సభ్యులైన ముస్సాకి జమున, జైసింగ్, కిషోర్, కామేష్లు కూడా ఛత్తీస్గడ్ కు చెందినవారే కావడం గమనార్హం. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించనున్నట్లు సమాచారం.



# సినీ ఇండస్ట్రీలో విషాదం
## బుల్లితెర నటి ఆత్మహత్య

**మొదటి పేజీ తరువాయి...**

కారణాలను ఆమె కుటుంబసభ్యులు వెల్లడించలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తన పెళ్లి తర్వాత సినిమాలకు, సీరియల్స్‌కు శోభిత. దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శోభిత మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బ్రహ్మగంతు సీరియల్‌తో గుర్తింపు. శాండల్‌వుడ్‌లో బ్రహ్మగంతు సీరియల్ ద్వారా శోభిత శివన్న పాపులారిటీ తెచ్చుకుంది. గతేడాది మే 22న పెళ్లి చేసుకున్న శోభిత ఆ తర్వాత బుల్లితెరకు దూరమైంది. అయితే తన పెళ్లి ఫోటోలను కూడా సోషల్ మీడియాలో షేర్ చేయలేదు. కర్ణాటకలోని సకలేష్‌పూర్‌కి చెందిన శోభిత మొదట్లో రాజ్ మ్యూజిక్ ఛానల్‌లో వీజేగా పనిచేసింది. ఆ తర్వాత మంచి ఆర్టిస్ట్‌గా సినిమాలతో పాటు బుల్లితెరపై తనదైన ముద్ర వేసింది. కన్నడ సీరియల్ బ్రహ్మగంతులో విలన్ పాత్రలో మెరిసిన శోభిత.. నీనిదలే అనే సీరియల్‌లో కూడా నటించింది. అంతేకాకుండా ఇతర భాషా సీరియల్స్‌లో కూడా కనిపించింది. బుల్లితెరతో పాటు అటెంప్ట్ టు మర్డర్, జాక్‌పాట్ సినిమాల్లోనూ నటించింది.

# చదువులతోనే గౌడ్ అన్నలకు గౌరవం
## మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): గౌడలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాలలో రాణించినప్పుడే గౌడ కుటుంబాలకు, గౌడ సమాజానికి గౌరవంతోపాటు కీర్తి దాని అంతట అదే వస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, టూరిజం శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ సంజీవయ్య పార్కులో గోపా 43వ కార్తీక వన భోజనాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గౌడ కుటుంబాలను ఉత్తేజ పరుస్తూ గౌడ కుటుంబీకుల పిల్లలు విద్యా, క్రీడలు, వైజ్ఞానికారంగాలపై దృష్టిపెట్టి బాగా ఉన్నత చదువులు చదివి చట్ట సభలలో, పాలున రంగాలలో కీలక భూమిక పోషించినప్పుడే గౌడ సమాజానికి కీర్తి, ప్రతష్టలు పెరగడమే కాకుండా ఆర్థికంగా వెనకబడి ఉన్న తోటి గౌడ కుటుంబాలను ఆదుకున్నట్టు అవుతుందని అన్నారు. ప్రతి గౌడ బిడ్డ గోపా లో సభ్యుడుగా చేరాలని అన్నారు. గౌడ కులస్తులందరూ ఐక్యమత్యంతో కలిసి ఉండాలని అన్నారు. టీపీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గౌడుల హక్కుల సాధన కోసం గౌడులందరూ ఐక్యమత్యం గా ఉండాలని అన్నారు. తమ పిల్లల చదువుల పై దృష్టి పెట్టి బాగా చదివించాలని అన్నారు. వన భోజనాల అతిథుల గౌరవ సమావేశానికి అధ్యక్షత వహించిన గోపా రాష్ట్ర



గోపా 43వ కార్తీక వనభోజనాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ గోపా కుటుంబాల సభ్యుల పిల్లలు చదువుతో పాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, లీడర్ షిప్ క్వాలిటీ లను అలవర్చుకుని అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, డాక్టర్ సుధాకర్



గౌడ్ అన్నల (గోపా) 43వ అతిథుల వన భోజనాల లో పాల్గొని ప్రసంగిస్తున్న గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్

గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్,గీత పారిశ్రామిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ,తదితర గౌడ కుటుంబుకుల ముఖ్య నాయకులు సహా పంక్తి వన భోజన కార్యక్రమానికి హాజరై గౌడ కులం, కుటుంబాలపై వారి వారి అభిప్రాయాలు తెలియజేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# చిలుకూరు మండలంలో తడిసిన ధాన్యం



**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):** తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి చిలుకూరు మండలంలోని నారాయణపురం, శీతలతండ, దూదియా తండాలలో ధాన్యం తడిసిపోయింది. రైతులు చేతికొచ్చిన పంట తడిసి పోవడం వల్ల చాలా ఇబ్బంది పడ్డారు.

# వ్యవసాయ మార్కెట్లో, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు చేయాలి





## తెలంగాణ రైతు సంఘం

**వైరా-ప్రభాత సూర్యుడు:** అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో, వ్యవసాయ మార్కెట్లో కనీస ఏర్పాట్లు చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం వచ్చిన అకాల వర్షాలకు వైరా మార్కెట్లో ధాన్యం రైతులు ఇబ్బందులను తెలంగాణ రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైరా వ్యవసాయ మార్కెట్లో వర్షం నీరు బయటకు వెళ్ళటానికి అవసరమైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల రేకుల షేడ్స్ పైన నుంచి వచ్చే వర్షం నీరు, మార్కెట్ ఆవరణ లో నీరు ధాన్యం రాసులు క్రింది నుండి ప్రవహించి ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారు అని వైరా వ్యవసాయ మార్కెట్లో వర్షం నీరు బయటకు వెళ్ళటానికి అవసరమైన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేయాలి అని డిమాండ్ చేశారు, కొన్ని కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు లేవు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ వడ్లమూడి మధు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి పథకంపై ప్రజాభిప్రాయం తప్పనిసరన్న సీఎం

### ప్రభుత్వంలో కీలకం కానున్న ఐవీఆర్ఎస్

### ఐవీఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలన్న సీఎం చంద్రబాబు

**అమరావతి, (ప్రభాత సూర్యుడు):** ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌరసేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఇందులో భాగంగా మెరుగైన సేవల కోసం నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ మేరకు ఐవీఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని చెప్పారు. ఏ అంశంపైనైనా ప్రజలు చెప్పిందే ఫైనల్ అని స్పష్టం చేశారు. నాణ్యమైన సేవల కోసం ఖచ్చితమైన అభిప్రాయం చెప్పాలని ప్రజలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకు వెళ్లాలని సర్కార్ నిర్ణయించింది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు వారి అభిప్రాయాల మేరకు నడుచుకోనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకనుగుణంగా ఇకపై ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ఐవీఆర్ఎస్ ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోనున్నారు. లబ్ధిదారుల నుంచి అభిప్రాయాల సేకరణ : ఈ క్రమంలో లబ్ధిదారులకే నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకం వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సేకరించనుంది. వాటిపై ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా సర్కార్ మార్పులు చేర్పులు చేసుకొని పనిచేయనుంది. ఇంటింటికీ పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాలకు సంబంధించి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు.



పింఛను సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా? లేదా? దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయాన్ని ఐవీఆర్ఎస్ ద్వారా సర్కార్ తెలుసుకోనుంది. ఉచిత ఇసుక విధానం అమలు, నూతన మద్యం పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు, కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపై కూడా ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరించనున్నారు. ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగుపరుస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని సర్కార్ భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కి ప్రజలు ఓపిగ్గా తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఈ ఫోన్ కాల్స్‌కి ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిమిషాల సమయంతో సర్కార్ నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. దీనికి ప్రజలు తమ వంతుగా సహకరించాలని చెప్పారు. మంచి పాలనకు, నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా వచ్చే ఖచ్చితమైన అభిప్రాయాలను తెలుసుకోవడంపై గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రయోగం చేసింది. అయితే ముఖ్యమంత్రి మెప్పు కోసం కొందరు అధికారులు ప్రజల వాస్తవ అభిప్రాయాలను తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డారు. అంతా బాగుంది అనే రీతిలో తప్పుడు సమాచారం ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలాంటివి పునరావృతం కాకుండా పటిష్ట వ్యవస్థ ద్వారా దీనిని జరిపితే మంచి ఫలితాలు వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల ఖరారు విషయంలో చంద్రబాబు ఇదే విధానాన్ని పాటించారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలకు ప్రభుత్వం నుంచి అందే సాయంపైనా కాల్స్ ద్వారా సమాచారం తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో దీన్ని విరివిగా వాడేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ఖచ్చితమైన సమాచారం ఇచ్చే అధికారులనే ఈ టీమ్ లో నియమిస్తే ఫలితాలు బాగుంటాయన్నది విశ్లేషకుల మాట.





# టూరిజంలో 5 లక్షల ఉద్యోగాలు

### మేథోమదనంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్

### ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్‌పో

### పెట్టుబడిదారుల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ప్రోత్సాహకాలు

**అమరావతి, (ప్రభాత సూర్యుడు):** పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వడం ద్వారా ఎమ్ఎస్ఎమ్ఈలకు ఇచ్చే రాయితీలన్నీ వర్తించి కొత్త ఉద్యోగాల కల్పనకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు. పర్యాటక రంగంలో ఉత్తేజం నింపే కొత్త విధానం ఇప్పటికే మంత్రివర్గం ఆమోదం పొందింది. త్వరలోనే కొన్ని మార్పులు, చేర్పుల తర్వాత అమల్లోకి వస్తుందని ఔత్సాహికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాఫీ, చాక్లెట్ ఫెస్టివల్స్ నిర్వహణ ద్వారా యువతను పర్యాటకంగా ఆకట్టుకునే అంశాల వైపు ప్రభుత్వం దృష్టి సారిస్తోందని విజయవాడలో నిర్వహిస్తోన్న ఏపీ బిజినెస్ ఎక్స్‌పో నిపుణులు అభిప్రాయపడ్డారు. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహిస్తోన్న బిజినెస్ ఎక్స్‌పోలో రెండో రోజు తయారీ, పర్యాటకం, ఆతిథ్యం, మౌలిక వసతులు, మహిళా సాధికారతపై ప్రత్యేక సదస్సులు జరిగాయి. 25 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా కొత్త పర్యాటక విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని, తద్వారా 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. పెట్టుబడిదారుల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. కొత్త పర్యాటక విధానం ద్వారా రాష్ట్ర స్థూల ఆదాయంలో 4.6 శాతం నుంచి 8 శాతానికి పెంపు నిర్దేశిత లక్ష్యంగా ఉందని, విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో దేశంలో మొదటి 10 స్థానాల్లో రాష్ట్రానికి చోటు కల్పించాలనేది సీఎం చంద్రబాబు ఆలోచనగా ఈ రంగం నిపుణులు తెలిపారు.

**విజయవాడలో బిజినెస్ ఎక్స్‌పో - ఆకట్టుకుంటున్న పారిశ్రామిక విధానాలు**

మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడంతో పాటు యువతలోని ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన నైపుణ్యాన్ని అందించేందుకు వీలుగా ప్రత్యేక గణన జరుగుతోందని, ఇది కొత్త అంకుర సంస్థల స్థాపనకు వీలు కలిపిస్తుందని నిపుణులు తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించడం ఆహ్వానించదగిన పరిణామమని, ఇదే సమయంలో జిల్లా పరిశ్రమ కేంద్రాల రూపురేఖలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎక్స్‌పోలో 160 స్టాళ్లు ఏర్పాటు చేశారు. 40 కొబ్బరి ఉప ఉత్పత్తులతో తీర్చిదిద్దిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం చిరుధాన్యాలను ప్రోత్సహిస్తున్నందున ఈ రంగంలోనూ కొత్తగా స్టార్టప్‌లు ఏర్పాటు చేసి యువ ఔత్సాహికులు ఉపాధి మార్గాలను స్థిరం చేసుకుంటున్నారు.

వినూత్న స్థానిక ఉత్పత్తులకు ఈ ఎక్స్‌పోలో ప్రత్యేక స్థానం కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన అనేక వస్తువులను ప్రదర్శనలో ఉంచారు.

## కోదాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న కోదాడ శాసన సభ్యులు ఉత్తమ్ పద్మావతి

**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన ప్రియతమ నాయకురాలు కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి కోదాడ నియోజకవర్గంలో రేపు ఉదయం 10 గంటలకు మోతె మండలం నుండి మొదలుకొని వివిధ మండలాల్లో వివిధ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి విచ్చేయుచున్నారు. మన కోదాడ నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నిరంతరం శ్రమిస్తున్న ఉత్తం పద్మావతి దంపతులకు అపూర్వ స్వాగతం పలకడానికి మన చిలుకూరు మండలం కుటుంబ సభ్యులు కనీసం 50 ,60 కార్లతో కనీవిని ఎరుగని రీతిలో స్వాగతం పలకాలని మిమ్మల్ని మనసారా ఆహ్వానిస్తున్నాం.

- చిలుకూరు మండల కాంగ్రెస్ పార్టీ.

# సుపరిపాలన అంటూ డబ్బా కొట్టుకుంటున్నడు

## రేవంత్‌పై హరీశ్‌రావు మండిపాటు

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** కాంగ్రెస్ ఏడాది పాలన అన్నిరంగాల్లో విఫలమైందని.. ఈ సర్కారు ఉత్త బేకారు ఉందని ప్రజలు అనుకుంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు, అసత్య ప్రచారంపై ఆయన మండిపడ్డారు. ఎవరు మెచ్చుకునే పరిస్థితి లేదు గనుక, ముఖ్యమంత్రి తన భుజం తానే తట్టుకుంటున్నాడని.. మాది సుపరిపాలన అంటూ డబ్బా కొట్టుకుంటున్నాడని విమర్శించారు. నీది సుపరిపాలన అని ప్రజలు చెప్పాలని.. నువ్వు కాదు రేవంత్ రెడ్డి అన్నారు. నీ అపరిపక్వత నీ అసమర్థత, నీ ప్రతికూల వైఖరితో రాష్ట్రంలో నేడు అన్నిరంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొన్నదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మంచి ఆర్థిక వృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే.. నీ రాక తర్వాత ఆశించిన మేరకు ఆర్థిక వృద్ధి రేటు పెరగలేదన్నారు. వృద్ధిరేటు పెంచే సత్తా లేదు.. సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక నోటికి వచ్చినట్లు వాగుతున్నావంటూ మండిపడ్డారు. నెపం ప్రతిపక్షం మీదకు నెట్టుతున్నావని.. ఆడరాక మద్దెల ఓడు అనే సామెతకు నీ మాటల్ని మించిన నిదర్శనం లేదంటూ ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి ఆదాయం పెంచే సత్తా లేదని.. ఇచ్చిన హామీలు అమలు చేసే చిత్తశుద్ధి, ప్రజలకు వాస్తవం చెప్పే దమ్ము లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలన ఎట్లుందంటే.. ముందు దగా, వెనుక దగా, కుడి ఎడమల దగా దగా అన్న శ్రీశ్రీ కవితలా ఉందన్నారు. రూ. 7లక్షలకోట్ల అప్పు అని ఏడాది కాలం నుంచి చెప్పిన అబద్ధం మళ్లీ మళ్లీ చెబుతున్నారంటూ ఫైర్ అయ్యారు. అబద్ధాలు ప్రచారం చేస్తే గోబెల్స్ ప్రచారం అంటారని.. గోబెల్స్‌ని మించిన రేబెల్స్ ప్రచారం నీది అంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం దాచిందని అసత్య ప్రచారం చేస్తున్నావని.. ప్రభుత్వం అట్ల దాచే అవకాశమే ఉండదు రేవంత్ రెడ్డి అంటూ మండిపడ్డారు. అప్పులు బహిరంగ రహస్యమేనని.. గణాంకాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉంటాయన్నారు. ప్రతీ ఏటా అసెంబ్లీలో ప్రవేశపెట్టే కాగ్ నివేదికల్లో ఉంటాయన్నారు. ఆ నాడు సీఎల్పీ లీడర్‌గా ఉన్న భట్టి విక్రమార్కకు రాష్ట్ర అప్పులు



ఎంతో, ఆదాయం ఎంతో తెలియదా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న మొత్తం అప్పు రూ. 4,26,499 కోట్లు అని అసెంబ్లీ వేదికగా లెక్కలతో సహా నిరూపించానన్నారు. ఇప్పటికీ అదే సవాల్ చేస్తున్నానన్నారు. నా వాదనలో సత్యం ఉందని.. సత్యాన్ని ఎదుర్కొనే శక్తి నీకు లేదని.. ఆర్థిక మంత్రికి లేదన్నారు. తోచిన అబద్ధమల్లా చెప్పి ప్రజల్ని తొవ్వ తప్పిద్దామనే తొండి బుద్ధి మీది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఛానల్ వేదికగా కూర్చుందామని.. ఏ ఆర్థిక నిపుణులతో కూర్చుందామో చెప్పు.. తప్పించుకోవద్దన్నారు. నీపేరే ఎగవేతల రేవంత్ రెడ్డి అని.. రైతుబంధును ఎవరు ఎగ్గొట్టారో ప్రజలకు తెలియదా? అంటూ ప్రశ్నించారు. ప్రజల విజ్ఞత మీద నీకు చాలా తక్కువ అభిప్రాయం ఉందన్నారు. మోసం చేసుడు నీకలవాటు, మోస పోవుడు ప్రజలకు అలవాటు అనే కదా నీ నమ్మకం అంటూ తీవ్రంగా స్పందించారు. గత ఎన్నికలకు ముందు రైతుబంధు కోసం 7,200 కోట్ల నిధులు సిద్ధం చేసి రైతుల ఖాతాల్లో వేసేందుకు ఎన్నికల కమిషన్ పర్మిషన్ తీసుకున్నామని.. తెల్లవారితే ఖాతాల్లో వేస్తామని తొర్రూరు సభలో స్వయంగా నేనే ప్రకటించానన్నారు. రైతుబంధు ఖాతాల్లో పడితే నీకు ఓట్లు డబ్బాలో పడవని భయమై, దుర్మార్గంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు ఆపింది నువ్వేనన్నారు. నోటికి కాడికి వచ్చిన బుక్కను ఎగ్గొట్టిన పాపాత్ముడివి నువ్వు అంటూ మండిపడ్డారు. ఇప్పుడైతే రూ. 10వేలు, మేమొస్తే రూ. 15వేలు అని రైతులను ఊరించి, నమ్మించి ఓట్లు కొల్లగొట్టిన ఘరానా మోసగాడివి నువ్వు అంటూ ఘాటుగా స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు మేము నిలదీస్తే విధిలేక మేము సిద్ధం చేసిన నిధులతో రైతుల ఖాతాల్లో 5వేలే వేశామని.. 7500 ఎందుకు వేయలేదంటూ నిలదీశారు. నిజాయతీ ఉంటే సమాధానం చెప్పాలనన్నారు. మొన్న వానాకాలం పూర్తిగా ఎగ్గొట్టినవని.. రైతుబంధును ఆపింది నువ్వు, లేని ఆశలు రేపింది నువ్వు, తీరా అధికారంలోకి వచ్చి ఎగవేసింది నువ్వు.. ఎగ్గొట్టింది మేమా నువ్వా? అంటూ ఫైర్ అయ్యారు. అబద్ధానికి అంగీ లాగు వేస్తే అచ్చం రేవంత్ రెడ్డి లెక్కనే ఉంటదని ప్రజలు అనుకుంటున్నారన్నారు. వరుసగా రెండు సంవత్సరాలు కరోనా వచ్చి రాష్ట్ర పరిస్థితి అతలాకుతలం అయిపోయినా కేసీఆర్ రైతు బంధును ఆపలేదని గుర్తు చేశారు. మా హయాంలో మొత్తం 11 విడతల్లో రూ. 72,815 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసిన రైతు బాంధవుడు కేసీఆర్ అన్నారు. ఆరు నూరైనా రైతు బంధు ఆపని కేసీఆర్ ఎక్కడా? ఏడాదిలోనే చేతులెత్తేసిన నువ్వెక్కడ ? కేసీఆర్ పేరు ఉచ్చరించే నైతికత కూడా నీకు లేదన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం

## మార్గదర్శకాలు జారీ చేసిన తితిదే

**తిరుమల (ప్రభాత సూర్యుడు):** తిరుమల: తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనభాగ్యం కల్పించేందుకు తితిదే ఏర్పాట్లు చేసింది. డిసెంబరు 3 నుంచి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. ఇందుకు సంబంధించి డిసెంబరు 2న తిరుపతిలోని మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో దర్శన టోకెన్లు ఉచితంగా జారీ చేస్తారు. మహతి ఆడిటోరియంలో 2,500 టోకెన్లు, తిరుమలలోని బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో 500 టోకెన్లు ఉదయం 3 నుంచి 5గంటల మధ్య జారీ చేయనున్నారు. ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత క్రమంలో టోకెన్లు కేటాయిస్తారు. దర్శనం టికెట్ పొందడానికి స్థానికులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు తప్పనిసరిగా చూపించాలి. టోకెన్లు పొందిన భక్తులు దర్శన సమయంలో ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ఫుట్‌పాత్ హాల్ (దివ్యదర్శనం)క్యూలైన్‌లో భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. ఇతర దర్శనాల్లో ఇచ్చే విధంగా దర్శనానంతరం ఒక లడ్డూ ఉచితంగా అందిస్తారు. స్థానికుల కోటాలో దర్శనం చేసుకున్న వారికి తిరిగి 90 రోజుల వరకు దర్శనం చేసుకునేందుకు అవకాశం ఉండదు.

### బంగ్లాలో కొనసాగుతున్న

# హిందూ మత వ్యతిరేక అల్లర్లు

**మరో 3 ఆలయాలు ధ్వంసం**

**హిందూ, భారత వ్యతిరేక నినాదాలు**

**భైరవ్‌లోని ఇస్కాన్ కేంద్రం పైనా దుండగుల దాడి**

**హిందూ పూజారి, మరొకరి అరెస్ట్!**

**కృష్ణ దాస్ కార్యదర్శి అదృశ్యం**



**ఢాకా, (ప్రభాత సూర్యుడు):** బంగ్లాదేశ్‌లో హిందూ మత వ్యతిరేక అల్లర్లు కొనసాగుతున్నాయి. తాజాగా పోర్ట్ సిటీ చిట్టగ్యాంగ్‌లోని హరీశ్‌చంద్ర మున్సఫ్ లేన్‌లో ఉన్న శంతనేశ్వరి మాత్రి ఆలయంతోపాటు సమీపంలోని సోనీ ఆలయం, శంతనేశ్వరి కలిబరీ ఆలయాలను లక్ష్యంగా చేసుకున్న దుండగులు శుక్రవారం దాడి చేసి ధ్వంసం చేశారు. వందలాది మంది ఆందోళనకారులు హిందూ, భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ ఇటుకలతో ఆలయాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. అయితే, పోలీసులు మాత్రం ఈ ఘటనను తేలిగ్గా తీసుకున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఇటుకలు విసురుకునే క్రమంలో ఆలయాలు స్వల్పంగా దెబ్బ తిన్నాయని పేర్కొన్నారు. మిలటరీ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చింది. మరోవైపు ఇస్కాన్‌కు చెందిన హిందూ పూజారి శ్యామ్ దాస్, మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల అరెస్టయిన హిందూ, ఇస్కాన్ నేత చిన్మయ్ కృష్ణ దాస్‌ను కలిసేందుకు జైలుకు వెళ్లిన సమయంలో శ్యామ్ దాస్‌ను, మరో వ్యక్తిని అరెస్టు చేశారని, అలాగే కృష్ణ దాస్ కార్యదర్శి కూడా అదృశ్యం అయ్యారని ఇస్కాన్ కోల్‌కతా అధికార ప్రతినిధి రాధారామన్ దాస్ తెలిపారు. దీనిపై బంగ్లాదేశ్ అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు భైరవ్‌లో ఉన్న ఇస్కాన్ కేంద్రంలో కొందరు దుండగులు విధ్వంసం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియోను రాధారామన్ దాస్ ట్వీట్ చేశారు.

**'బంగ్లా దేశీయులకు వైద్యం చేయం'**

ఇక నుంచి బంగ్లాదేశ్‌కు చెందిన వారికి చికిత్స చేయొద్దని కోల్‌కతాలోని జేఎన్ రే దవాఖాన నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులు, భారత దేశ జెండాను అవమానించిన ఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు దవాఖాన అధికారి సుభ్రాంశు భక్త్ వెల్లడించారు.

**మా ఆందోళనలను భారత్ పరిష్కరించాలి**

ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు ఢాకా దీర్ఘకాల ద్వైపాక్షిక ఆందోళనలను భారత దేశం పరిష్కరించాల్సి ఉందని, అయితే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సత్సంబంధాలపై తాము ఇంకా ఆశాజనకంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. ఇస్కాన్ నేత కృష్ణదాస్ అరెస్ట్‌తో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బంగ్లా విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హెుస్సేన్ మాట్లాడారు. ఆగస్టు 5 తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాల మధ్య మార్పు చోటుచేసుకున్న మాట వాస్తవమేనన్నారు.

**అరెస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు**

బంగ్లాలో హిందూ నేత అరెస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని, అతడిని ఒక నిర్దేశిత ఆరోపణలతో అరెస్ట్ చేసినట్టు బంగ్లాదేశ్ సమర్థించుకుంది. యూఎన్ ఫోరమ్‌లో మైనారిటీల సమస్యలపై నిర్వహించిన సమావేశం సందర్భంగా జెనీవాలోని ఐరాస బంగ్లాదేశ్ శాశ్వత ప్రతినిధి, దౌత్యవేత్త తెరిక్ ఎండీ ఆరిఫుల్ ఇస్లామ్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై ఎలాంటి క్రమబద్ధమైన దాడి జరగలేదని హిందూ నేత అరెస్ట్ అంశం తమ న్యాయస్థానం పరిధిలో ఉందని ఆయన స్పష్టం చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయని, మైనారిటీలపై నిత్యం దాడులు కొనసాగుతున్నాయని ఇంటర్నేషనల్ ఫోరమ్ ఫర్ సెక్యులర్ బంగ్లాదేశ్ (ఐఎఫ్ఎస్‌బీ) ప్రతినిధి ఒకరు సమావేశంలో ఆరోపించారు.

# తీరం దాటిన ఫెంగల్ తుఫాన్

## 16 గంటల తర్వాత తెరచుకున్న చెన్నై ఎయిర్‌పోర్ట్

**చెన్నై (ప్రభాత సూర్యుడు):** బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ తీరం దాటింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి మధ్య మహాబలిపురం-కారైకాల్ వద్ద తీరం దాటినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ క్రమంగా బలహీన పడుతుందని, దీంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిపై తుఫాను విరుచుకుపడింది. భారీ వర్షాలు, వరదలతో ఇరు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. తమిళనాడులో కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో చెన్నై సహా పలు జిల్లాల్లో రాకపోకలు స్తంభించాయి.

గత 34 గంటల్లో చాలా ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్ల నుంచి 27 సెంటీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. చెన్నై నగరవ్యాప్తంగా 134 ప్రాంతాలు నీట మునిగినట్లు అధికారుల అంచనా వేశారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం, కుండపోత వర్షాలతో సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. బలమైన గాలులు వల్ల చాలా ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయని, వాటిని తొలగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కరెంటు షాక్‌తో ముగ్గురు మరణించారు. ఇక 14 గంటల తర్వాత చెన్నై విమానాశ్రయం తెరుచుకున్నది. ఎయిర్‌పోర్టులోకి నీరు చేరడంతో శనివారం మధ్యాహ్నం విమానాశ్రయాన్ని అధికారులు మూసివేశారు. పలు విమానాలను రద్దుచేశారు. అయితే ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఎయిర్‌పోర్టులో తిరిగి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయితే విమాన సర్వీసులు మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు.

**ఏపీలో భారీ వర్షాలు..**

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లాలో తడ దగ్గర జాతీయ రహదారిపై పెద్దఎత్తున వాన నీరు నిలిచింది. జిల్లాలోని సూళ్లూరుపేట తడ, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. సూళ్లూరుపేట, ఏర్పేడు, నారాయణవనం, కేవీబీపురం మండలాల పరిధిలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో.. గూడూరు, కోట, వాకాడు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

# కాంగ్రెస్‌తో పొత్తు లేదు

## దిల్లీలో ఆప్ ఒంటరి పోరు: అరవింద్ కేజ్రీవాల్

## ఇండియా కూటమికి క్రాక్ - ఢిల్లీలో ఒంటరి పోరుకు సిద్ధమైన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ఆదివారం వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ఇలాంటి ప్రకటన చేయడం వల్ల ఇండియా కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది.

**ఒంటరి పోరుకు సిద్ధం!**

"ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పొత్తులకు దూరంగా ఉంటుంది. ఒంటరి పోరుకు మేము సిద్ధం అవుతున్నాం" అని విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేజ్రీవాల్ స్పష్టం చేశారు. వాస్తవానికి ఇంతకు ముందే, ఢిల్లీ ఎన్నికల్లో పొత్తు లేకుండా చేస్తామని కాంగ్రెస్ కూడా ప్రకటించింది.

**కలిసి పోటీ చేసినా నో యూజ్!**

వాస్తవానికి ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ రెండూ కలిసి పోటీ చేశాయి. కానీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయాయి. మొత్తం లోక్ సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. అలాగే ఈ ఏడాది పంజాబ్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోవడానికి ఆప్ నిరాకరించి, 13 స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగింది. ఇక హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇరుపార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదరలేదు.

**లిక్విడ్ ఎటాక్**

శనివారం దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సంచలనం రేపింది. మెరుపు వేగంతో స్పందించిన భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ దాడిపై తాజాగా కేజ్రీవాల్ స్పందించారు.

"అసలు నేను చేసిన తప్పు ఏమిటి? ఢిల్లీ శాంతిభద్రతల అంశాన్ని లేవనెత్తాను. కేంద్రమంత్రి అమిత్ షా ఈ విషయంలో చర్యలు తీసుకుంటారని ఆశించాను. కానీ దానికి బదులు పాదయాత్రలో నాపైనే దాడి జరిగింది. ఓ వ్యక్తి నాపై ద్రావకం చల్లాడు. అది హానికరమైనది కావొచ్చు. అయినా మేము భయపడం. మేము ప్రజా సమస్యలను లేవనెత్తాం. మీకు వీలైతే గ్యాంగ్‌స్టర్లను అరెస్టు చేయించండి. అంతే కానీ, మమ్మల్ని ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు" అని మోదీ సర్కార్‌ను ప్రశ్నించారు.

# ఎఫ్‌బీఐ చీఫ్‌గా కశ్యప్ పటేల్

## ఇండియన్ అమెరికన్‌కు ట్రంప్ కీలక బాధ్యతలు



**వాషింగ్టన్, (ప్రభాత సూర్యుడు):** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ వచ్చే నెలలో ప్రమాణం స్వీకారం చేయనున్నారు. ఈనేపథ్యంలో తన ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తన పరిపాలన టీమ్‌లోకి ఒక్కొక్కరిని తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు భారత సంతతికి చెందిన వ్యక్తులకు కీలక పదవులు కేటాయించారు. తాజాగా కశ్యప్ పటేల్‌కు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించారు. దేశంలోనే అత్యంత ముఖ్యమైన దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చీఫ్‌గా పటేల్‌ను నియమించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. 'ఎఫ్‌బీఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ పటేల్ వ్యవహరిస్తునందుకు నేను గర్విస్తున్నా. కాష్ గొప్ప లాయర్, పరిశోధకుడు. దర్యాప్తులో దిట్ట. అమెరికాలో అవినీతి నిర్మూలనకు, న్యాయాన్ని గెలిపించేందుకు నిరంతరం శ్రమిస్తున్న అమెరికా ఫస్ట్ ఫైటర్. అమెరికా ప్రజల రక్షణలో ఆయన కృషి గొప్పది. ఆయన నియామకంతో ఎఫ్‌బీఐకి పునర్వైభవం తీసుకొస్తాం' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫాంలో వెల్లడించారు. కశ్యప్ పూర్వీకులు గుజరాత్ నుంచి వలస వెళ్లారు. అతని తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. కాష్ తండ్రి, ఉగాండలో నియంత ఈదీ అమిన్ బెదిరింపుల కారణంగా అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో కశ్యప్ జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఓ లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో మియామీ కోర్టుల్లో లాయర్‌గా వివిధ హెూదాల్లో సేవలందించారు.

# బ్రిక్స్ దేశాలకు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్.. భారత్ నిర్ణయం ఇదే

**వాషింగ్టన్, (ప్రభాత సూర్యుడు):** బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలకు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అంతర్జాతీయంగా జరిగే వ్యాపార,వాణిజ్య వ్యవహారాల్లో డాలర్‌ను కాదని, బ్రిక్స్ దేశాలు సొంత ఉమ్మడి కరెన్సీని తయారు చేసినా, లేదంటే వేరే కరెన్సీని ఉపయోగించినా వాటిపై 100శాతం సుంకం విధిస్తామని స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్ వేదికగా బ్రిక్స్ దేశాల సదస్సు జరిగింది. ఆ సదస్సులో బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీపై దృష్టిపెట్టాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ పిలునిచ్చిన నేపథ్యంలో.. అమెరికా అధ్యక్షుడిగా రెండో దఫా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. బ్రిక్స్ దేశాలు అంతర్జాతీయ వ్యాపార,వాణిజ్య వ్యవహారాల నిమిత్తం తమ సొంత కరెన్సీ తయారు చేసుకోవాలని, లేదంటే ఇతర కరెన్సీ వినియోగించాలనే ప్రయత్నాలు చేస్తున్నాయి. డాలర్‌ను వద్దనుకుని సొంతం కరెన్సీని తయారు చేసుకోవడం అంతమంచిది కాదు. కాదు కూడదు అంటే వాటిపై 100 సుంకం విధిస్తాం. అంతేకాదు, అద్భుతమైన ఆర్థిక వ్యవస్థతో అగ్రగామిగా ఉన్న అమెరికాతో మీరు (బ్రిక్స్) వ్యాపార వ్యవహారాల నుంచి దూరం కావాల్సి వస్తుంది. ఒకవేళ డాలర్ వద్దనుకుని వేరే కరెన్సీతో వ్యాపారం చేస్తామంటే అది అసాధ్యమే అవుతుంది. అయితే అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌ను ఏ ఇతర కరెన్సీతో భర్తీ చేయలేదు 'అని ట్రంప్ నొక్కాణించారు. అయితే, బ్రిక్స్ సొంత కరెన్సీ వినియోగాన్ని భారత్ వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఫార్మాస్యూటికల్స్, ఐటీ, టెక్స్‌టైల్స్ వంటి క్లిష్టమైన రంగాల్లో అమెరికాతో బలమైన వాణిజ్య సంబంధాన్ని కొనసాగుతున్న భారత్.. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగే అంతర్జాతీయ వ్యాపార,వాణిజ్య వ్యవహారాలపై భారత్ అప్రమత్తంగా ఉంది. ఈ తరుణంలో బ్రిక్స్ దేశాలు సొంత కరెన్సీతో అంతర్జాతీయ వ్యాపార వ్యవహారాలు చేయడం మంచిది కాదని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డాలర్ కాదంటే వాణిజ్యం పరంగా పోటీ,నష్టాల్ని చవిచూడాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారని దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ మీడియా సంస్థ మెయిల్ తన కథనంలో హైలెట్ చేసింది.





Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215